నాగనృత్యం

శ్రీ భాగవతుల సూర్యనారాయణశాస్త్రి

"'కన్నెపిల్ల మనసూ వెన్నపూస సొగసూ కలిపి రంగరించిన సోయగంతో కలకాలం వర్ధిల్లాలనుకున్నాను. మాలిమిచేసి కూరిమిపొందే మనుగడమాదైనా మనసుకలిసిన చోట మనువు నిలుపుకోవాలనుకున్నాను. పలకం పున్నానికి పూచిన చింతల్లే పుణ్యంపండిన పురుషుడితో ఒక్కముచ్చటలోనయినా ముక్కువ తీరితే జీవితానికి చాలునని తలచేను. అందుకే మన్నేలేవాడు నన్నేలేవాడు కాకూడదని మీనాక్షీదేవికి మ్రొక్కులిచ్చుకున్నాను. వరమిచ్చిన వేలుపల్లేవరదరాజస్వామి ఆలయంలో కనుపించిన తమకి—నిండు సువాసినిని, పువ్వంటిపుని స్త్రీని, మన్నించాల్సిన మానవతిని వెతలపాలుచేసిన పండంటి మారాజని తెలీక–మనసిచ్చుకున్నాను. కాని ఆ ఉత్తమయిల్లాలి ఉసురు తగిలితే జయంకలుగదు కదయ్యా! కనుక పోయి రండయ్యా! పుణ్యవతిని కలిసి వుండయ్యా! అంటూ ఆనాడు నాంచారి పలికిన పలుకులు ఈనాటికీ మరువరానివి." అన్నాడు తాతయ్య.

నిజమే ఆపాటీపాటి యెరిగున్నవాళ్ళెవరూ నాంచారి రూపాన్నిగాని, నాంచారి పలికిన పలుకుల్నిగాని, నాంచారి సుగుణాల్నిగాని, ఎలా మరిచి పోగలరు? అనిపిస్తుంది నామట్టుకు నాకు.

కాని తాతయ్య కేవలం ఈ ఒక్కసారే అనడం కాదే! ఇంకా యిలా ఎన్నోసార్లు ఈ మాటలే అన్నాడు.

పోనీ తాతయ్య అలా అనడం ఎలాగూ సహజం అని సరిపెట్టుకుందామా అంటే, అవ్వకు కూడా నాంచారిని చూస్తే వల్లమాలిన గౌరవం, అభిమానమూను. అందుచేత నాంచారినిగురించిన పూర్తి వివరాలేమిటో ఆ కథాకమామీషులు తెలుసుకోవాలనుకున్నాను.

అయితే ఎవరినడిగి తెలుసుకోవడం? తాతయ్యనడుగుదామంటే, నా కతనిదగ్గర చెప్పరానంత భయం భక్తీ రెండూను. అందువల్ల ఎలాగూ ధైర్యం చాలదు. ఇక నాంచారినే అడుగుదామనుకుంటే చెప్తుందో చెప్పదో అని అనుమానం. ఇలాంటప్పుడు ఏం చెయ్యాలి? ఎలాగైతేనేం అవ్వనడిగి తెలుసుకుందామని నిశ్చయించి అవ్వదగ్గిరికి వెళ్లేను.

ఎడమకాలు ముడుచుకుని, ఎడమకాలి పాదానికి కుడికాలి పాదం ఆనిస్తూ, పూటీగా నిలబెట్టి కుడికాలి మోకాలి మీద కుడిచేతి నానించి పద్మం పట్టిన పార్వతీదేవి హస్తంలాగ హస్తం పెట్టి వొత్తులు నలుపుతూ వంటింటి ద్వారబంధాని కానుకుని అవ్వ కూర్చుంది.

పండుతమలపాకులాంటి మొగముతో, పచ్చని పసినిమ్మపండురంగు చాయతో, నెరిసీనెరవని జుట్టుతో ముఖానికి పచ్చగా పసుపు రాచుకుని, ఎర్రగా దమ్మిడీఅంత బొట్టు పెట్టుకుని, సన్నని కాటుక రేఖతోవున్న అవ్వ పార్వతీదేవిలాగ కలకలలాడుతూ కళ్లకి కనుపించింది.

మెల్లగా అవ్వదగ్గిరకెళ్లి కూర్చుంటూ "అవ్వా! నాంచారిచరిత్ర ఏమిటో పూర్తిగా చెప్పవ్?" అని అడిగేను.

ఈ ప్రశ్నవిని అవ్వ పకాలుమని నవ్వి వూరుకుంది. ఏమైనాసరే చెప్తేగాని వీల్లేదని పట్టుపట్టేను.

"నాంచారికథ చెప్పాలంటే నాకథా, మీతాత కథా అంతా చెప్పాలి. అంచేత ముందూ వెనకా లంకంతకథ వుంది, చెప్పాలంటే" అంది అవ్వ. అయినా చెప్పమన్నాను. సరికదాఅని చెప్పడం మొదలుపెట్టింది అవ్వ.

"ఆరోజులలో, అంటే మీతాత చిన్నతనం రోజులలో చదువూ సంధ్యా లేకుండా, ఇంటిపట్టున వుండకుండా అల్లరిపిల్లల్తో ఆడుతూ ఇంట్లోవాళ్లని ఆయన నానాబాధ పెడుతూ వుండేవారు. కొట్టి, తిట్టి, ఎన్నివిధాలప్రయత్నించినా లాభంలేకపోయేసరికి

వంశాన్నుద్ధరించవలసిన ఒక్కగా నొక్క కొడుకూ ఎందుకూ కొరగాకుండాపోయేనే అని వాళ్ళమ్మా, నాన్నా బెంగపెట్టుకుని ఎప్పుడు చూసినా దిగాలుగా వుండేవారు.

అప్పుడు మానాన్న 'పిల్లవాడిని నాతో తీసుకు వెళ్లి నేను బాగుచేస్తా' నని చెప్పి ఆయిద్దరినీ సముదాయించి, మీ తాతని తనతోకూడా యింటికి తీసుకు వచ్చేడు. మానాన్న ఆలా చెయ్యడానికి కారణం నేనూ, మీతాత మేనత్తమేనమామపిల్లల మవడమే.

ఆప్రకారంగా మానాన్న ఇంటికి తీసుకొచ్చేక నయాన్ని భయాన్ని ఎన్నోవిధాల నచ్చజెప్పి మీతాతని ఇంట్లో అట్టేబెట్టుకున్నాడు. ఉన్నట్టుగాఉండి మీ తాతకునన్నిచ్చిపెళ్ళిచెయ్యాలని నిశ్చయించుకున్నాడు మానాన్న; ఇలా అనుకోవడమేమిటి 'డెబ్బయిరెండు వినియోగాల' తాను తలపెట్టినకార్యం నిర్విఘ్నంగా నెరవేర్చేడు. అప్పుడు నా వయస్సు మూడేళ్ళు, మీ తాతవయస్సు పదిహేనేళ్ళు.

మా పెళ్లికి పెట్టిన మేజువాణీలో శంపాలత, చంపావతి, అనే అక్కచెల్లెళ్లిద్దరూ 'భామపతంగం' అభినయిస్తూవుండగా మీ తాత చూసేరు. అంతతో ఆయనకి ఏవేవో భావాలు కలగడం మొదలుపెట్టేయి. అందువల్ల మళ్లుతోరణానికి వెళ్లి మళ్ళుదలయి వస్తూ వుండగా మధ్యదారిలో మీ తాత మాయమయేరు.

ఈ సంగతి ఇంటికి వచ్చేక తెలుసుకున్న మా వాళ్ళు, వూరూ, నాడూ గాలించేరు; వాడవాడలా వెతికించేరు. కాని ఎన్నివిధాల ప్రయత్నించినా ఏం లాభం లేకపోయింది. ఏం చేయడానికి పాలుపోక ఎప్పటికేనా కాలం కలిసిరాకపోతుందా అనేభావంతో ఎదురుతెన్నులుచూస్తూ వున్నారు.

క్రమంగా నేను పెరిగి ఏడేళ్లదాని నవడంతో ఊహ తెలిసేప్రాయం వచ్చింది. అప్పటినుంచి మా వాళ్ళు నాకు ఏ తరహామనుష్యులతో ఎటువంటిమోస్తరుగా మసులుతూ ఎలా మాట్లాడాలో మప్పి చెప్పడం మొదలుపెట్టేరు. పుష్పతాంబూలం, ఫలతాంబూలం, పసుపుతాంబూలం, నిత్యతాంబూలం అరుగుడు పసుపు, అట్లతద్దె, నిత్యశృంగారం చిట్టింబొట్లు, మోచేతి పద్మం, శ్రావణమంగళవారాలు, ఉదయకుంకం లాంటి కన్నెనోములన్నీ నోపించేరు. ఆటనాడు ఆటనేర్పి, పాటనాడు పాట నేర్పి- ఒకరిల్లు వదిలి ఒకరిల్లు చొచ్చి, ఒకడాలినని చెప్పుకుంటూ వుండడానికి తగ్గ-వంటా వార్పు, పనీ పాటు సమస్తం చెప్పించేరు.

ఈమోస్తరుగా మావాళ్లు నాకు మన్నెం మర్యాదలు మప్పిచెప్పి, కన్నెనోములన్నీ నోపించి, అయినింటిఆడపడుచుకి అక్కరకొచ్చే విద్య నేర్పించడంతో, ఒకరిచేత వేలుమడిపించుకోకుండా, ఓ యిల్లాలా! అని పదిమందిచేత అనిపించుకుని జాతికి తగ్గ నీతి నిల్పుకుంటూ పరువుగా బ్రతకడానికి వీలుగా తయారుచేసేరు; కాని మీతాత అప్పటికీ తిరిగిరాలేదు.

ఆనాడు అలా మధ్యలోనే మాయమైపోయిన మీతాత ఎక్కడెక్కడో తిరుగుతూ మేజువాణీగాని, భరతనాట్యముగాని, భాగవతాలుగాని ఎక్కడ ఏది జరిగితే అక్కడికల్లా హాజరవుతూ వుండేవారు.

ఈప్రకారముగా ఉన్నవూళ్లో తినకుండా, తిన్నవూళ్లో పడుకోకుండా ఛప్పన్నదేశాలూ సంచారం చేస్తూవుండగా దారిలో ఒకసిద్ధపురుషుడు మీతాతకుకనిపించేడు, ఆ సిద్ధపురుషుడు మీతాతను చూసీచూడ్డంతోనే ఏమనుకున్నాడో ఏమోగాని, ఆరోజునుంచి ఆయన్ని తనవెంట తిప్పుకుంటూ సకల చదువులూ చదివించేడు, నాట్యవిద్య నేర్పించేడు. తుదకు మంత్రోపదేశంకూడాచేసి "ఇక నీమానాన నువు బ్రతుకు." అని చెప్పి తనదారిని తాను పోయేడు.

కాలికి బలపం కట్టుకున్నట్టుగా కాలానకుండా తిరుగుతూవుండే మీ తాత కాంచీపురానికి చేరుకుని వరదరాజస్వామి ఆలయానికి విజయంచేసేరు. ఆ సమయంలో ఆలయం అంతా కోలాహలంలో నిండివుంది. ఏమిటా అని అనుకుంటూ, అడుగుల్లో అడుగు వేసుకుంటూ కళ్యాణమంటపం ఆవరణకి చేరుకున్నారు మీ తాత.

ఆ ఆవరణంతా ఇసకవేస్తే రాలనంతగా జనంతో క్రిక్కిరిసి కిటకిటలాడుతూవుంది. ఎదురుగావున్న వేదిక దగ్గర పురోహితులు ఆశీర్వచనపనసలు చదువుతున్నారు. కంచురంగు కంచుకం తొడిగి, గోచీపోసి కట్టిన కొర్నాటిపట్టుమీద పద్మాలపట్టు పైటవేసుకొని పన్నెండేళ్ళ బాలాకుమార్తె నిటారుగా నిలుచోనుంది. పండుముత్తయిదువు లొక్కక్కతే వేదికమీదికి వచ్చి

ఆ పిల్లదానిచేతిలో పళ్ళు, పూవులు పెట్టి నెత్తిన అక్షింతలు చల్లి వెళ్లిపోతున్నారు. అక్కడున్న వారిలో ఒకరిని విషయ మేమిటని మీ తాత అడిగేరు.

"నాగమణి కూతురు నాంచారికి 'గజ్జెలపూజ సంబరం' చేస్తున్నారు." అని ఆ పెద్దమనిషి చెప్పేడు. అంటే ఏమిటో వివరంగా చెప్పమన్నారు మీ తాత.

"ఏముందీ, కళావంతులలో పిల్లదానికి అక్షరాభ్యాసం అయేక కులంలోవున్న పెద్దముత్తయిదువని గురువుగాయెంచి, ఆవిడకిపిల్లదాన్ని అప్పగించి, నాట్యవిద్య నేర్పించుతారు. విద్యంతా పూర్తికాగానే ఒక మంచి ముహూర్తం చూచి, ఆనాటి ఉదయం కుల పెద్దల ఎదుట పిల్లదానిచేత నాట్యంచేయించుతారు. ఆరోజున కులస్థులందరినీ భోజనాలకి పిలుస్తారు. ఆ సాయంత్రం దేవాలయంలో పూజలు చేయించి కళ్యాణమంటపంలో గజ్జెలకి కూడా పిల్లదానిచేత పూజచేయించి, ఆశీర్వచనం అయినతరువాత, స్వామివారి యెదుట నృత్యంచేయిస్తారు. ఈ నృత్యం చూడ్డానికి కులపెద్దలతోబాటు పురప్రముఖుల్ని కూడా ఆహ్వానిస్తారు. స్వామివారి సన్నిధిని, అందరి సమక్షంలోనూ చేసిన నృత్యానికి, అందరి మన్ననా పొందిన తరువాత—గురువుగాని, లేక కులపెద్దలలో మరెవరైనా గాని వేదికమీదికి వచ్చి పిల్లది పూజచేసిన గజ్జెల్ని పిల్లదాని కాలికి కడ్తారు. ఆలా కాలికి గజ్జెకట్టడమంటే నాటినుంచి పిల్లది మేళంకట్టడానికి అర్హురాలుగా ప్రకటించడ మన్నమాట. 'గజ్జలపూజ సంబరం' అంటే ఇది. ఇప్పుడు నాంచారికి అదే జరిపిస్తున్నా"రని ఆ పెద్దమనిషి చెప్పేడు.

ఆ మాటలు విన్నమీదట నాంచారి నృత్యం ఆరంభించబోయేసమయానికి మీ తాత అక్కడి జనాన్ని తప్పించుకుని మంటపానికి దగ్గరగా వెళ్ళికూర్చున్నారు. నాంచారి నానారకాలుగా నాట్యంచేస్తూవుంటేచూడ్డానికివచ్చిన పురప్రముఖులు, నట్టువరాండ్రు అందరూ తన్మయత్వంలో లీనమై ఉన్నారు. కన్ను చెదరనీకుండా కన్నుల వైభవంగా చేస్తున్న నాంచారి నాట్యం అందరి మన్ననలు పొందకుండా వుంటుందా! వచ్చినవాళ్ళందరూ సెబాసని హర్షించేరు.

కులపెద్దలలో ఒకామె వచ్చి నాంచారి కాలికి గజ్జెకట్టింది. నలుగురు పేరంటాండ్రు వచ్చి నివ్వాళితో నీరాజన మిచ్చేరు. వచ్చినవాళ్ళందరూ ఒక్కొక్కరే జారుకుంటున్నారు.

అప్పుడు నాంచారి వాళ్ళమ్మ నాగమణిని పిలిచి చెవిలో యేదో చెప్పింది. నాగమణి సరేనని నవ్వుకుని మీ తాతని పిలిచింది; తమతో ఇంటికి రమ్మంది. మీ తాత వాళ్ళతోకూడా వెళ్లేరు. ఇంటికి వెళ్ళిన తరువాత నాగమణి మీ తాతతో ఇలా చెప్పింది:

"అబ్బాయిగారు అన్యథా తలంచకుండావుంటే బుద్ధిపూర్వకంగా ఒక్క మనవి."

ఏమిటన్నట్టుగా చూసేరు మీ తాత. నాగమణి మళ్ళీ చెప్పసాగింది: "మాకులదైవం, యీ వంశానికి మూలం అయిన రత్నావతీదేవినాటినుంచి నిన్నటి నావరకూ యీ వంశములో పుట్టిన ఆడకూతుళ్లు కులవృత్తిని చేపట్టినవాళ్ళు కొందరైతే, కుల విద్యనుమాత్రమే నమ్ముకున్నవాళ్ళు కొందరు. అయితే మా తల్లిగాని, నేనుగాని కేవలం కులవిద్యను మాత్రమే నమ్ముకుని జీవించేము గాని మరోవిధముగా మనడంలేదు. అందుకే నాంచారికికూడా 'పైటసంబరం' నాడు మధ్యాపాపిట తీయించి కుడిపైటవేయించి నివ్వాళి ఇప్పించేను. వేదవేదాంగపారంగతులు, సకలశాస్త్రకోవిదులు, సర్వవిద్యాపరిపూర్ణులు అయిన బ్రాహ్మణోత్తమునిరక్తసంజాతయిన నాంచారి తనకి బ్రాహ్మణచిన్నవాడే కంకణం కట్టాలని కోరుకున్నందుకు నాలో నేనే గర్వపడుతున్నాను.

"నాంచారికి కేవలం నాట్యవిద్య నేర్పించడమే కాకుండా అమరం చదివించేను, ఆదికావ్యం చెప్పించేను; పంచకావ్యాలూ పఠింపజేసేను. అంతేకాదు, కులగౌరవ కుటుంబగౌరవాలు బోధించేను; మన్నన మర్యాదలు మప్పదల జేసేను; మానవతిగా బ్రతుకమని హితవు చెప్పేను; గుణవతి ననిపించుకోగల గురుతుకి వచ్చేట్టుగా తయారుచేసేను. ఆ చిన్నది ఇంగితమెరిగి, ఈ డేరి ఇప్పటికి ఆరుమాసాలే అయినప్పటికీ గజ్జెలపూజ సంబరంకాగానే కంకణంకట్టించడానికి నిశ్చయించేను.

చంపకి చారడేసివున్న చక్రాలలాంటి కళ్లు, సెన్నుదుటి మచ్చ, సేవలీకమైన ముక్కు, చూడముచ్చటయిన చుబుకం, విశాలమైన వక్షం, వంపులు తిరిగిన ఆ తలకట్టు, మణికట్టు గలిగిన రూపురేఖా విలాసాల్ని తిలకించిన అమ్మాయి తన హృదయాన్ని అంకితం చేసుకున్నదంటే అబ్బురమేమీలేదు. కను

బొమలమధ్య కనుపించే ఆ కళాకాంతుల్ని గమనిస్తే అబ్బాయిగారివిద్యాపాటవంఏపాటిదో అర్థంఅవుతూనే వుంది. కనుక తమరు అన్యథా భావించకుండా అవునని అంగీకరించినట్లయితే ధన్యనైతినని తలంచి కంకణాల సంబరానికి ముహూర్త మేర్పాటు చేయిస్తాను. మన్నించండి, మరోవిధంగా భావించకండి. అనుజ్ఞ దయచేయించండి;" అని చెప్పి దోసిలొగ్గి నిలచింది నాగమణి.

సిగ్గుతో శిరసొంచిన నాంచారి నవ్వుముఖం గమనించి అంగీకారం సూచిస్తూనే దేశద్రిమ్మరినని తెలియజేసేరు మీ తాత. అయినా ఫర్వాలేదను కున్నారు ఆ తల్లీకూతుళ్లు.

పురప్రముఖుల్ని, శ్రేష్ఠులైన నగరంవాళ్లని చూడడానికి పిలిచి ఆ అందరి సమక్షంలో నెత్తిమీద జీలకర్ర, బెల్లం ప్రమాణం చేయించిన చిన్నవాడిచేత నల్లపూసలు గుచ్చిన నాను మెడకీ చేతికి కంకణము కట్టేస్తారు. పిల్లదానికి ఆ రోజున బ్రాహ్మణచిన్న వాడు కంకణం కట్టినట్టయితే—తెలుపు నీలంరంగు పూవులు తురుముతూ అయిదుపాయలతో జడవేసి పంచవన్నెల పూలచెండు తలలో ముడుస్తారు. ఆలాగే రాచవారిచిన్నవా డయినట్లయితే - తెలుపు, ఎరుపు రంగు పూలు తురుముతూ నాలుగుపాయలజడ వేస్తారు. నగరంవారిబాలు డయితే, అంటే కోమటిబిడ్డయితే తెలుపు యెరుపు నీలిరంగు పూలు తురుముతూ మూడు పాయలజడ వేస్తారు. ఒక్కకులస్థుడైన చిన్నవాడు తాళికట్టడానికి తప్పిస్తే, కడమ ఏజాతికీ కంకణం కట్టే అర్హత లేదు.

'కంకణాల సంబరం' నాడు ఈమోస్తరుగా పాటించడం అనాదినుంచీ వస్తూవున్న ఆచారం కాబట్టి మీ తాతను వూరి పొలిమేర తోటలో విడిది చేయించేరు. టకోరా, గనిశెట్టు మేళాలతో ఎదురు సన్నాహమవుతూ, వెల్లగొడుగువేసి వల్లభంపట్టి బాజా భజంత్రీలతో పాడుకురాగా—తెలుపూ నీలంరంగు పూలు తురిమి, అయిదుపాయల జడవేసి—నాంచారికి ఆ మహనీయుడిచేత కంకణం కట్టించి, అందరిసమక్షం లోనూ అతివైభవంగా సంబరం జరిపించేరు.

అయితే, వూరూరాతిరిగే ఆ ఉత్తమపురుషుడు నాటిరాత్రి కొంగున కట్టిందికి బంగారం ఎక్క ణించి తేగలరు! అందుచేత చెక్కిలిమీద చెయ్యి వేసి శిరస్సువే చెంగున ముడిపెట్టేరు. ఆకారణంవల్ల ఆయన ఆజన్మం ఆవిడ ఆజ్ఞాబద్ధుడై వుండవలసిందే. కాని ఆ సుగుణవతి తన కన్నులతో మన్నించి, మనస్సా ధ్యానించి, భక్తితో ఆయన పాదపూజ చేయ డమే పరమావధిగా భావించింది. కనుకనే ఆ మారాజు నాగనృత్యం నేర్పించి, కట్నంగా నాంచారికి మంత్రోపదేశం చేసేరు.

కనికరించి కన్నె చెరబాపిన మహనీయుడు కొద్ది కాలంపాటే నిభాయించుకు నిలబడ్డారు. కాని ఒక అర్ధరాత్రివేళ చెప్పాచెయ్యకుండా వెళ్లిపోయారు. మొదటనేదేశద్రిమ్మరినని తెలియజేసేరు కనుక పాపం చేసేదేమీ లేక చింతిస్తూ, ఆయన రూపాన్నే చిత్రించు కుంటూ - తాను ఉపదేశం పొందిన మంత్రం జపిస్తూ- ఆయనరాక కెదురుచూస్తూ నాంచారి కాలం గడుపు కొంస్తూ వుంది.

అక్కడనుంచి అలా బయలుదేరిన మీ తాత మళ్లీ దేశాలన్నీ తిరిగి తిరిగి ఎలాగైతే నేం మావాళ్ళింటికి చేరుకున్నారు.

అప్పటికి నాకు పదేళ్లు నిండి పదకొండో ఏడు వచ్చింది. ఇంగితజ్ఞానం కలిగింది; ఇల్లూ, వాకిలీ చక్క బెట్టుకోగల నేర్పు తెలిసింది. ఈ డేరడం కూడా అయింది. అంతవరకూ మీ తాత రాకకోసం ఎదురు చూస్తూ వున్న మావాళ్ళందరూ ఆయన రావడంతో ఆపై కాగలకార్యం నెరవేర్చడానికి సిద్ధపడ్డారు.

మనసుపెట్టిన ఆ మారాజు కనికరం చూపుతూ కంటితో ఆలించి, పంటితో పాలించి, ఆలనతో ఆదరిం చేరు. ఆయన కరుణరసమే గడ్డకట్టి మీనాన్న రూపు ఏర్పడింది. కానీ, పొత్తిళ్లలో పాపణ్ని చూసి పొంగి పోకుండా మూడువారాలు తిరిగేసరికి మీ తాత మళ్ళీ ఇల్లు వదలి వెళ్ళిపోయారు.

ఏ జన్మలో చేసిన పాపమో ఈ జన్మలో అను భవిస్తున్నామని దుఃఖిస్తూ తులసిపూజలు చేసేను; అశ్వత్థప్రదక్షిణాలు ఆచరించేను; అభిషేకాలు చేయిం చేను; గ్రహశాంతులూ, జపాలూ జరిపించేను.

అంతేకాకుండా ఈ జన్మలో సుఖంమాట ఎలా వున్నా మరుజన్మలోనన్నా ఇటువంటి దుఃఖం లేకుండా వుండాలని- 'భక్తి తప్పినా ఫలం తప్పరాదు. వాక్కు తప్పినా వరం తప్పరాదు. వ్రతంలో లోప మున్నా ఫలంలో లోపం వుండరాదు' అని ఉద్యాపన

సంకల్పం చెప్పుకుంటూ గౌరీపూజ, వరలక్ష్మీవ్రతాలు చేసేను. ఫలాలగౌరి, దంపత్తాంబూలాల నోములు నోచేను. ఆకలన్నవాళ్ళకి అన్నం పెట్టేను; దప్పిగొన్నవాళ్లకి నీళ్ళిచ్చేను; చలితో బాధ పడుతున్నవాళ్ళకి బట్టలిచ్చేను; వెలుగు వేసినవారికి వెలుగు కనిపిస్తుందన్న నమ్మకతో సందె వెలుగులు వేశాను; సంధ్యాస్నానాలు చేసేను. ఇంకా ఎన్నెన్నో నోములునోచి, ఏవేవో వ్రతాలు చేస్తూ వెయ్యి దేవుళ్ళకి మొక్కుతూ మీ తాత దర్శనం ఎప్పటికి అవుతుందా అని ఎదురు చూస్తూ వున్నాను.

ఆ వెళ్ళడం వెళ్ళడం మీ తాత తిన్నగా నాంచారి ఇంటికి వెళ్ళేరు.

ప్రతినిత్యమూ ప్రభాతకాలంలో అసలు సిసలైన నాగుపాము తూర్పుదిక్కుముఖమై, తోక మీదుగా లేచినిటారుగా నిలబడి, ఉదయసూర్యుడికి పడగతో ప్రణమిల్లుతూ కొద్ది లిప్త లుంటుంది. ఆ తర్వాత దగ్గరలోనున్న చెట్టుకొమ్మకి తోకని చుట్టుకొని సూర్యాభిముఖంగా సాగిలబడి మ్రొక్కుతుంది ఆ పిమ్మట భూమిమీద ప్రాకుతూ పుట్టలోకి వెళ్ళిపోతుంది. సిసలైన నాగుపాము సూర్యదేవుడికి ఆ ప్రకారంగా నమస్కరిస్తున్నప్పుడు 'నా జోలికి నరులూ, నరులజోలికి నేనూ పోకూడ'దనే భావంతో ప్రార్థిస్తుందనిన్నీ, నరుల కంటబడ్డ నల్లనాగు నెత్తి నేలని కొట్టుకుని చచ్చిపోతుం దని చెప్పుకుంటూ వుండడం పరిపాటి.

నిజానికి, సూర్యనమస్కారాలు చేసే సర్పరాజుని దృష్టిలో పెట్టుకోవడంవల్లనే, స్వచ్ఛందమరణాన్ని పొందగోరే నర్తకులు నాగనృత్యం నేర్చుకునేందుకు సిద్ధపడేవారు. దైహికంగా ఆరోగ్యాన్నీ, ఐహికాముష్మికానందాన్నీ, స్వచ్ఛందమరణాన్నీ పొందగల్గడమే నాగనృత్యానికి విశిష్టత. అందుకనే నాట్యవిద్యలో ఆరితేరినవాళ్లు నాగనృత్యాన్ని అభ్యసించడానికి ఉద్దేశించేవారు. అయితే అందరికీ అది అంత సులువుగా అందుబాటులో వుంటుందా, ఎక్కడో అదృష్టవంతులకి తప్పితే? అందువల్ల అందరికీ అలభ్యమైన విద్య, పూర్వజన్మసుకృతంవల్ల తనకి లభ్యమయినట్టుగా భావించి. అప్పటికే మీ తాతవల్ల ఉపదేశం పొందినమంత్రాన్ని పునశ్చరణచేస్తూవుండడంవల్ల మంత్రసిద్ధి అవడంతో నాంచారి నాగనృత్యంలో దిట్ట అనిపించుకుంది.

ఆకాలంలో ఈ మన ఉత్తరాదిని శంపాలత, చంపావతి అనే అక్కచెల్లెళ్ళు భామపతంగం పట్టడంలోనూ, మాణిక్యం మోడీనృత్యాలు చెయ్యడంలోనూ, సుందరి దశావతారీ పట్టడంలోనూ పేరు గడించి వున్నారు. అలాగే నాంచారికూడా నాగనృత్యంలో పేరు సంపాదించుకుంది.

'అందరూ ఒక ఎత్తు, అగస్త్యుడొక్కడే ఒక ఎత్తు' అనే సామెత చెప్పినట్టుగా ఉత్తరాదిని పేరుబడసిన ఆ ముగ్గురితో దీటుగా దక్షిణాదిని నాంచారి ఒకత్తే వుంది తప్ప అంతకుముందుగాని, ఆ తర్వాతగాని నాగనృత్యంలో నాంచారిని తలదన్నదగ్గ మనిషి ఇటు ఉత్తరాదినీ, దక్షిణాదినీకూడా లేకపోయింది.

అలా పేరుప్రఖ్యాతులుగన్న ఆ నలుగురు నారీరత్నాలు ఎప్పుడు ఎక్కడ నృత్యం చేసినా దేశమంతా, తిరగబడి, కనకం కురించేవారు.

ఆరీతిగా కులవిద్యనిమాత్రమే నమ్ముకుని నాగనృత్యప్రదర్శనతో కాలంగడుపుతున్న నాంచారికి నృత్యాని బయలుదేరేముందు నాగమణి జడవేస్తూవుండేది. ఆ జడవెయ్యడంలో ఒక ప్రత్యేకత వుంది. పంచవన్నెలపూలు తురుముతూ నాలుగు పాయల జడవెయ్యడం ఆ జడమీద తెలుపు, ఎరుపు రంగుల పూలచెండు ముడవం దానిప్రత్యేకత.

అయితే, అప్పుడే నాగమణి కాలంచెయ్యడాన్నిఅటుపైని 'ఎవరు జడవెయ్యగలరా'అనినాంచారి దుఃఖభారంలో ఆలోచిస్తున్న సమయంలో మీతాత అక్కడికి చేరుకున్నారు.

మీతాతని చూడగానే - ఏనుగంత సత్తువ, గుఱ్ఱమంత పరుగు వచ్చినంత ఉత్సాహంతో నాంచారి ఉప్పొంగిపోయింది. నాటినుండి నాగనృత్యం చేయబోయేముందు నాంచారికి జడవేస్తూ, స్థిరంలేకుండా తిరుగుతూవుండే మీతాత అక్కడే వుండిపోయేరు.

ఈసంగతి ఆనోటా ఆనోటా చెప్పుకోగా ఎలాగయితేనేం మాకందరికీ తెలిసింది. కాని మాకు తెలిసేసరికే పదేళ్లకాలం గడిచిపోయింది.

అప్పుడు మానాన్న అల్లుడిని తీసుకొస్తానని బయలుదేరబోయాడు, కాని నేనే అడ్డుపడ్డాను. అన్నిరకాల తర్జనభర్జనలు అయినమీదట పిల్లవాడిని వెంటబెట్టుకుని నేనూ మానాన్న బయలుదేరిందికి నిశ్చయించుకుని ప్రయాణమయేము.

మేము ఆవూరు చేరుకునేసరికి సాయంత్రం అయింది. నాటిరాత్రి ఆవూళ్లో నాగనృత్యం జరుగుతుందని మాకు తెలిసింది. మేము సరాసరి నాంచారి ఇంటికి బయలుదేరాము. ఎప్పుడూలాగానే మీతాత నాంచారికి జడవేస్తూవుండగా ఆసమయంలో మేము అక్కడికొచ్చేము.

ద్వారం దాటగానే ఈసంఘటన చూసిన నేను, అడుగు ముందుకి వెయ్యలేక, పిల్లవాడిని చేతబట్టుకుని అక్కడే నిలబడిపోయేను. మమ్మల్ని చూడడంతోనే అల్లుతూఅల్లుతూవున్న జడపట్టుని వదిలిపెట్టేశారు మీతాత. మాలో ఏఒక్కరమూ మాట్లాడకుండా అటుప్రక్క నాంచారీ, మీతాతా-ఇటుప్రక్క పిల్లవాడితో బాటు నేనూ, మానాన్నా - మొత్తం అయిదుగురం స్తబ్ధుగా వుండిపోయేము.

ఎలాగైతేనేం కొంతసేపటికి నేనే మెల్లిగా తేరుకుని "ఒక్కసారి దర్శనం చేసుకుందామని వచ్చేను; ఆ భాగ్యం కలిగింది; ధన్యురాల్ని. ముఖ్యంగా పిల్లవాడికి మిమ్మల్ను చూపించడం నావిధి కొబట్టి ఇలా సాహసించగలిగేను. కనుక మన్నించమని వేడుకొంటూ శెలవు తీసుకుంటున్నాను" అని చెప్పి మా నాన్నతో బాటు పిల్లవాడిని వెంటబెట్టుకు తిరిగి వచ్చేశాను.

మేము తిరిగి వచ్చేస్తూవుండగా నాంచారిగాని, మీతాతగాని వుండమనలేదు. సరికదా, ద్వారబంధం దగ్గరే నిలుచుండిపోయి దేవాలయంలో దేముణ్ణి చూసి వచ్చేసినట్టుగా చూసివచ్చేయడం బాగులేదంటూ మా నాన్న ఎంతో కోపగించుకున్నాడు. అలా చేయడమే ఉత్తమధర్మమని చెప్పి ఆయన్ని నిదానంగా సమాధాన పరిచేను; అంతతో ఆయన మరేమీ అనకుండా వూరుకున్నాడు.

ఆతరువాత మీతాత నాంచారికి మళ్లీ జడవేసేరు. కాని పట్టిన పట్టుకి మొదటనే విఘాతం కలగడాన్ని నాంచారి ఆరోజు నాగనృత్యం చెయ్యలేకపోయింది. అంతే! నాటినుంచి నేటిదాకా మళ్ళీ నాంచారి నాగనృత్యం చేయనేలేదు.

నాగనృత్యం చేయలేకపోయి, తిరిగి ఇంటికి చేరుకున్నాక "కన్నెపిల్ల మనసూ వెన్నపూస సొగసూ కలిపి రంగరించిన సోయగంతో కలకాలం వర్ధిల్లాలనుకున్నాను..." అంటూ ఆమాటలన్నీ అని మీతాతని వెళ్లమని చెప్పి పంపించింది.

నాంచారి అన్నమాటలూ, తనబుద్ధీ రెండూ కలిపి ఆలోచించిన ఆ మారాజు తిన్నగా ఇంటికి వచ్చేసినందుకు మావాళ్ళంతా ఎంతో సంబరపడ్డారు. సంగతంతా తెలుసుకున్న నేను "ఆసుగుణవతి మనస్ఫూర్తిగా కనికరించి, దయతలచి, మిమ్మల్ను పంపించింది కనుకనే తిరుగా ఈ భాగ్యాన్ని నేను పొందగలిగేను. అయితే ఆవిడదికూడా నాలాంటి ఆడజన్మే. ఆకారణంచేత ఆడదాని హృదయం ఆడది సులువుగా అర్థంచేసికోగలదు. కొబట్టె ఆలోచించి చెప్తున్నాను; వెంటనే ఆవిణ్ణి పిలిపించండి" అని మీతాతని వేడుకుంటూ నాటిరాత్రి చెప్పేను.

నేను చెప్పినమాటల్ని చెవినిపెట్టి మీతాతవెంటనే నాంచారిని పిలిపించేరు; నాంచారి పరమానందంతో రెక్కలు కట్టుకునివచ్చి వాలింది. అప్పటినుంచీ మన ఎదుటింట్లో వుంటూనాంచారి ఇక్కడే వుండిపోయింది. నీతికి నిలబడి, నియమానికి కట్టుబడి స్థిరచిత్తంతో, సద్బుద్ధితో మసలుతూవుండడంవల్లనే వూళ్లోవాళ్లందరిచేతా ఓహో అనిపించుకుని నలుగురిలోనూ తలెత్తుకు తిరుగుతూ ఈ నలభైఏళ్ళనుంచీ నాంచారి ఇక్కడే వుంటోంది.

అప్పుడావిధంగా ఆవిడపెట్టిన భిక్షవల్లనే మీరందరూ పుట్టడంతో మనవంశం చిలవలుపలవలుగా ఇంత బాగా విస్తరించగలిగింది. ఆనాడు మీతాతని పంపించడానికి నాంచారి అన్న ఆమాటలే ఈనాటికీ మరువరానివని మీతాత ఎప్పుడూ వల్లెవేస్తూవుంటారు. సరికదా, సహస్రమాసపుజీవి అయిన ఆసత్యార్షి ఈరోజు ప్రొద్దున్నకూడా జబ్బుగా వున్నప్పటికీ మరచిపోకుండా వాటినే మననం చేస్తూవున్నారు. ఇదీ ఇప్పటివరకూ గడిచిన నాంచారికథ."అని అవ్వ చెప్తూవుండగా తాతయ్య పిలుస్తున్నాడని నాన్నవచ్చి అవ్వతో చెప్పేడు.

వత్తులుపెట్టెమూసి, వంటింటి గుమ్మంలో పొదికట్లనే వుంచి అవ్వ తాతయ్య దగ్గరకి వెళ్లింది. నేను కూడా అక్కణ్ణించి కదలి అవ్వతో వెళ్లేను.

అవ్వ, తాతయ్య దగ్గరికెళ్లి ఏమని అడిగింది. తాతయ్య మళ్లా అవేమాటలు అంటూ నాంచారిని పిలిపించమని అవ్వతో చెప్పేడు. వెంటనే అవ్వ నాంచారికి కబురుచేసింది. తాతయ్య పిలుస్తున్నాడన్న కబురు వినగానే ఎదురింట్లోవున్న నాంచారి ఒంటి

నిండా బట్టకప్పుకొని ఒక్క పెట్టున ఆదరాబాదరాగా పరుగెత్తుకొచ్చింది.

నాంచారి తాతయ్య దగ్గరికెళ్ళి "రమ్మని పిలిపించారా?" అంది వినయంతో నెమ్మదిగా. అవునన్నాడు తాతయ్య. ఎందుకన్నట్టుగా నాంచారి తాతయ్య ముఖంలోకి చూసింది.

"నాంచారీ! ఇలా చూడు. సహస్రమాసపు జీవినైన నేను ఇంక ఎంతో కాలం జీవించను. కానీ ఈ ఆఖరుఘడియల్లో వున్న నా కడసారి కోరిక ఒకటి వుంది, తీరుస్తావా?" అన్నాడు తాతయ్య.

తాతయ్య అలా అంటూండగా నాంచారి కళ్లు చెమ్మగిల్లేయి. కళ్లొత్తుకుంటూ "చిత్తం, సెలవీయండి" అంది నాంచారి.

"మరేం లేదు, గజ్జెలపూజసంబరం నాడు నీ నాట్యవిన్యాసాలు లీలగా చూసేను. ఆ తర్వాత వయస్సులోవున్న ఉమ్మస్సుచేత నేను ఎప్పుడూ కోరనూలేదు; నువ్వు కూడా నాగనృత్యంలో ప్రసిద్ధి పొందడాన్ని కేవలం దానినే ప్రదర్శిస్తూ వుండే దానివి. దానా దీనా నీ నాట్యావిన్యాసాలు మళ్లా చూసేభాగ్యం కలగకపోవడాన్ని ఆ కోరిక చిరకాలంగా నాలోనే జీర్ణించిపోయింది. ఇటీవల ఆ కోరిక మళ్లా తలెత్తి నా మనస్సుని బాధిస్తూవుంది. కనుక నా కడసారి కోరిక నెరవేర్చి బారెడుప్రొద్దులో వున్న ఈ జీవితాన్ని ఆనందమయం చెయ్యవూ?" అన్నాడు తాతయ్య.

నాంచారికళ్లు మళ్ళీ చెమ్మగిల్లేయి. నాటికి నలభై ఏళ్ళనుంచీ గజ్జెకట్టడం మానేసిన తాను నాట్యం చెయ్యడం సాధ్యమా అనేసంశయం కలిగి నాంచారి ఒక్కసారి దీర్ఘంగా ఆలోచించింది. కొద్దిసేపటికే ఒక నిశ్చయానికివచ్చి "తప్పకుండా తమకోరిక తీరుస్తాను. కొంచంసేపు ఓపికపట్టండి; అన్ని ఏర్పాట్లూచేసి ఆరంభిస్తాను." అని నాంచారి సమాధానం చెప్పింది. తాతయ్య బ్రహ్మానందభరితుడయేడు.

ఆ వెంటనే శంపాలతని, చంపావతిని వెనకపాట పాడడానికిన్ని, వాళ్లతోవున్న వాద్యబృందాన్నీ రమ్మనమని నాంచారి కబురుచేసింది. అంతవరకూ తాను ఉపదేశం పొందిన మంత్రాన్ని పునశ్చరణ చేసుకుంటూవున్న నాంచారి వాద్యబృందంవాళ్లు రాగానే, నాట్యం అలవాటుతప్పనిమనిషికిమల్లే ఎక్కడలేని ఉత్సాహాన్ని పొందగల్గింది; నాట్యానికి సిద్ధపడింది.

"వాతాపి గణపతిం భజేహం" అని విఘ్నేశ్వర స్తోత్రాన్ని శంపాలత, చంపావతి పాడుతూవుండగా, వాద్యబృందం వాయిస్తూవుండగా నాంచారి కాలికి గజ్జెకట్టి మరొక్కసారి మంత్రం పునశ్చరణచేసి ధ్యానముద్రపట్టింది.

విఘ్నేశ్వరప్రార్థన కాగానే 'దినకరా శుభకరా' అని సూర్యదేవతాప్రార్థన మొదలుపెట్టగానే, ధ్యానముద్రితో నెత్తిమీద చేతులు జోడించి మునివ్రేళ్ళతో అనుకుని మోకాళ్ళమీద కూర్చున్న నాంచారి, అదే ముద్రతో నాగుపాములాగ వంపులు తిరుగుతూ లేచినుంచుని అభినయించడం మొదలుపెట్టింది.

"ఆరోగ్యం భాస్కరాధీనం" అన్నమాట జ్ఞప్తికి వచ్చి ప్రార్థన చేశారా అన్నట్లుగా సూర్యదేవతా ప్రార్థనకావడంతోనే తాతయ్యకి కూడా ఉత్సాహం పుట్టుకొచ్చి అమాంతంవంత నాట్యం చెయ్యడానికి లేచినుంచున్నాడు. పుట్టెడుకూటిబలగంఅయిన మేమందరం ఆశ్చర్యంతో చూస్తూ వున్నాం.

"ధీంత ధీంత ధిమిధారిమి తోం కిణ ధిత్తోం ధిత్తోం ధిత్తోం, తకిట ధిమికిట ॥ధీంత॥ అనే తిల్లాన పల్లవితో ఆరంభించిన నాంచారి, తరంగం, అష్టపదీ, పదవర్ణం, పదం వరసగా నభినయించింది. ఆ తరవాత దీప, ఘట, హంస, మయూర, పారువా నృత్యాలు వరుసగా అభినయిస్తూవుంటే తాతయ్య కూడా వంతనృత్యం చేస్తున్నాడు.

ఈ నాట్యాలన్నీ అయేక 'భామ కలాపం' అభినయిస్తూ "చెలియా వయ్యారీ ముద్దుల చెంచు భామానోయమ్మా" అని పాడుతూ మధ్యమధ్య "ఏమే మాధవీ" అన్నప్పుడల్లా పంచకొంగు పైటగా వేసుకుని "ఔనోయమ్మా" అంటూ మాధవిగానూ, అటు పిమ్మట చెంచుదొరగానూ తాతయ్య వంతనృత్య చేయసాగాడు. మేమందరం ఆశ్చర్యంగా చూస్తున్నాము. భామకలాపం అభినయించడంతో భాగవతపు దరువులు కూడా కాగానే "పదం అభినయించిన మీదట చిట్టచివరని ముక్తాయిస్వరపు అవృత్తులు

వాయిస్తూ ఉండగా అందు కనుగుణంగా నృత్యం చెయ్య"మని తాతయ్య చెప్పేడు.

తాతయ్య చెప్పిన మాటలు విని "ఇది ప్రదర్శన చూడడమా, లేక పరీక్షించడమా" అనే అనుమానంతో మేమందరం బిత్తరపోయి చూస్తూ ఉండిపోయాము. కానీ నాంచారిమాత్రం నిస్సంకోచంగా అభినయిస్తూ పాటపూర్తికాగానే, మృదంగం, ఘటం తాళగతి తప్పకుండా ముక్తాయిస్వరాల అవృత్తులు వాయిస్తూంటే వాటి కనుగుణంగా నృత్యం చేస్తూవుంది. అలా నృత్యం చేస్తూంటే చూస్తూవున్న మేమందరం చలనం లేకుండా నివ్వెరపాటుతో నిలుచుండిపోయేము.

ఆ తరువాత చిట్టచివరికి– నట్టువరాలు స్వాముల వారి దర్శనానికి వెళ్ళినప్పుడు ఆ స్వాములవారి సన్నిధిని ఏ ప్రకారంగా నృత్యం చేస్తారో అప్రకారంగా "లలనా! సద్గురుని బాసి తాళజాలనే, ఓ లలనా," అని వెనుకపాటతో నాంచారి అభినయిస్తూంది. వంత నాట్యం చేస్తున్న తాతయ్య పద్మాసనం వేసుకుని స్వాములవారిలాగ ధ్యానముద్రపట్టె కూర్చున్నాడు.

"కంటిలో కన్ను మూసి కంటిపాప నంటజేసి ఇంటవంటలేని గురుతు నమరియుండజేసిన॥ లలనా సద్గురుని బాసి, తాళజాలనే, ఓ లలనా," అని వెనక పాటలో నాంచారి అభినయిస్తూ వుండగా ధ్యాన ముద్రలోవున్న తాతయ్య ప్రాణవాయువులు ఎగిరిపోయి అనంతవాయువుల్లో లీనమయిపోయాయి.

నాంచారి అభినయిస్తూనే ఇదిగమనించి వెంటనే స్వాములవారికి ప్రదక్షిణనమస్కారా లాచరించి నట్టుగా నాట్యం చేస్తూనే—తాతయ్య చుట్టూ ప్రదక్షిణం చేసి ఎదుటికి వచ్చి సాష్టాంగపడింది.

ఒకక్షణ గడచింది, రెండు క్షణాలు గడిచేయి; ఆఖరుకి అరఘడియకూడా గడిచింది. కానీ నాంచారి లేవలేదు. అంతవరకూ వాద్యబృందం వాయిస్తూనే వున్నారు. శంపాలతా, చంపావతీ ఒకరు చేతితో లయ వేస్తూవుంటే మరొకరు తాళంవేస్తున్నారు. ఎవ్వరమూ దగ్గరికి వెళ్ళలేదు.

చివరికి ఘడియకూడా గడిచిపోయేసరికి ఆందోళనతో అవ్వవెళ్ళి నాంచారిని లేవనెత్తి చూసింది. ఇంకేముంది! నాంచారి కూడా ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయింది. ఎక్కడివాళ్ళమక్కడ స్తంభీభూతంగా నిలబడేసరికి వాయిద్యాలు ఆపుచేసేశారు. అందరం ఒక్కసారి గొల్లుమన్నాం.

ఆ తర్వాత ఆ యిద్దరినీ ఉత్సవంతో ఊరేగించి, చందనపుచెక్కలతో పేర్చిన చితిమీద చేర్చగా అవ్వ అక్కడికొచ్చి నిలచింది.

"సహగమనం చేసి సతీత్వాన్ని నిలబెట్టుకున్నావే నాంచారీ! వెయ్యివేలజన్మలకికూడా మీ ఇద్దరినీ విడదీయకుండా ఉండేందుకు ఆ భగవంతుణ్ని ధ్యానిస్తా వుంటాను."అంటూ అవ్వ ఆ ఇద్దరికీ నమస్కరించింది. మేమందరంకూడా చెయ్యెత్తి మొక్కేము. అప్పటి నుంచీ ఆయిద్దరినీ కులదేవతలుగా కొల్చుకోవడం మా కుటుంబానికి ఆచారమయింది.

ఇదంతా జరిగి నేటికి నాలుగు పుష్కరాలు గడిచిపోయేయి. కానీ నాంచారితోబాటు దేశంలో నాగనృత్యంకూడా అంతరించిపోయిందే అన్న చింత మాత్రం మిగిలిపోయింది. ఆ చింత తీరాలంటే ఎప్పుడో, ఏమిటో ?!—